క్లుప్తంగా

31న ధూమపాన పురాతన పరికరాల ప్రదర్శన



సేకరించిన ధూమపానం పరికరాలు

మద్దిలపాలెం: ధూమపానం వలన కలిగే నష్టాలను వివరించాలనే ఉద్దేశంతో ధూమపానం వినియోగానికి వాడిన పురాతన పరికరాలను ప్రదర్శించనున్నట్టు విశ్రాంత ఉద్యోగి శివప్రకాష్ చెప్పారు. ఈనెల 31వ తేదీన సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని లాజరస్ క్యాన్సర్ ఆస్పత్రిలో ఈ పరికరాల ప్రదర్శించనున్నామన్నారు.

28న దుర్గమ్మ వార్షిక జాతరోత్సవాలు



దుర్గమ్మ అమ్మవారు

బీచ్‌రోడ్డు: చిన వాల్తేరులోని కనకమహాలక్ష్మి (దుర్గ) అమ్మవారి జాతర మహోత్సవం ఈ నెల 28వ తేదీన వైభవం నిర్వహించనున్నట్టు ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.గాయత్రి తెలిపారు. బుధవారం అమ్మవారి తోల్లేళ్ల జాతర నిర్వహిస్తామన్నారు. ఆలయాన్ని విద్యుత్‌దీపాలంతో అలంకరించామన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అమ్మవారి తొలి పూజకుగాను రూ.250 చెల్లించాలని, ఇద్దరికి మాత్రమే ప్రవేశం ఉంటుందన్నారు.

సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణ

సీతంపేట: వైశాఖ మాసం శనివారం సందర్భంగా అక్కయ్యపాలెం లలితానగర్‌లోని శ్రీలలితా పీఠంలో గల వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ చేశారు. ముందుగా స్వామి వారికి సుప్రభాత సేవ, సహస్ర నామార్చన, విశేష హారతులిచ్చారు. శ్రవణ నక్షత్రం సందర్భంగా బుధవారం ఉదయం 7.30 గంటలకు భూ సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామికి విశేష పంచామృతాభిషేకం జరుగుతుందని పీఠం మేనేజర్ మన్నివ కృష్ణసేస్ తెలిపారు.

రా..రమ్మని..



నిద్రకు ఉపక్రమిస్తున్న సమయంలో ప్యారెట్స్



మెడలో పాముతో చిన్నారి, మహిళ



మార్మొసెట్



ఇగ్వానా బల్లి

ఏయూక్యాంపస్: పక్షి ప్రపంచం పరవశింపజేస్తుంది. విభిన్న ప్రాంతాల్లో ఉండే అనేక రంగురంగుల పక్షులు ఒక్కచోట చేరి విశాఖ వాసులను కనువిందు చేస్తున్నాయి. బీచ్‌రోడ్డులో ఏయూ మైదానంలో నిర్వహిస్తున్న మెరైన్ పార్క్ ఎగ్జిబిషన్ దీనికి వేదికయ్యింది. ఎగ్జిబిషన్‌లో భాగంగా అండర్ వాటర్ స్నల్ ఫిష్ ఎక్వేరియంతో పాటు పదుల సంఖ్యలో పక్షులు, వైవిధ్యమైన జంతువులు అలరిస్తున్నాయి. నగరవాసులు, పర్యాటకులు ఈ ఎగ్జిబిషన్‌ను తిలకించి సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఎగ్జిబిషన్‌లో భాగంగా పక్షి, జంతు ప్రపంచంలో అరుదైన దక్షిణ అమెరికా, బొలీవియా, బ్రెజిల్, కొలంబియాలో కనిపించే మర్మోసెట్, యూకే, కెనడా, అమెరికా, మెక్సికోలో కనిపించే గోల్డెన్ పీజెంట్, జావా పిచుకలు, అల్బినో కాక్‌టైల్, ఎకలెక్టస్ చిలుకలు, మకావు పక్షులు, బాబ్‌వైట్ పక్షులు, బాతులు, ఆస్ట్రిచ్‌లు, తెల్లని సరీసృపం, కుందేళ్లు, అనేక పక్షిజాతులు ఇక్కడ సందర్శకులను అలరిస్తున్నాయి. చిన్నారులు వీటిని తిలకించి ఆనందానికి గురవుతున్నారు. పుస్తకాలలో, టీవీలలో చూసే పక్షులు, జంతువులను ప్రత్యక్షంగా చూసి సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



జావా పిచుక



గోల్డెన్ పీజెంట్



అల్బినో కాక్‌టైల్

సాయినాథ్ బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

బీచ్‌రోడ్డు: హనుమంతు వాక విమ్స్ ఎదురుగా శ్రీ సాయినాథ్ మహారాజ్ ఆలయ బ్రహ్మోత్సవాలు జూన్ 2,3,4 తేదీల్లో ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ చైర్మన్ బీవీ రమణ కుమార్, ఫౌండర్ బి.ఉదయలక్ష్మి తెలిపారు. సందర్భంగా వార్షికోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హర్యానా ప్రభుత్వ ప్రధాన సలహాదారు బ్రిడ్జి కిషోర్ హాజరవుతారన్నారు.

ఊళ్లకు వెళ్తే ముందస్తు సమాచారమివ్వండి



మాట్లాడుతున్న డీసీపీ నాగరత్నం

ఆరిలోవ: వేసవి సెలవుల్లో ఊరు వెళ్లేవారు పోలీసులకు ముందస్తు సమాచారం అందిస్తే ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరాలను ఏర్పాటు చేసి నేరాలు జరగకుండా పర్యవేక్షిస్తామని నగర డీసీపీ నాగరత్నం అన్నారు. శనివారం ఆరిలోవ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తాళం వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు ముందస్తు సమాచారం ఇస్తే ఇంటి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని, ఎవరైనా దొంగలు ప్రవేశిస్తే వెంటనే సీసీఎస్‌లో అలారం మోగుతుందని సిబ్బంది వెంటనే పోలీస్ స్టేషన్‌ను సమాచారం ఇస్తారన్నారు. తద్వారా దొంగలను అదుపులోకి తీసుకోవడం, ఇంట్లో విలువైన వస్తువులకు రక్షణ కల్పించడం సాధ్యపడుతుందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. 94933 36633 నంబరుకు ఫోన్ చేస్తే సిబ్బంది వచ్చి కెమెరాలు బిగిస్తారని, ఊరు నుంచి వచ్చిన వెంటనే సమాచారం ఇస్తే కెమెరాలు తొలగిస్తారన్నారు. నగరంలో పలు కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం వలన నేరాల సంఖ్య తగ్గిందన్నారు. సమావేశంలో నేర విభాగం ఏసీపీ వెంకట రావు, ఆరిలోవ సీఐ గోవిందరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

పెరుగుతున్న కూరగాయల ధరలు



రైతు బజార్‌లో కూరగాయలు విక్రయిస్తున్న రైతులు



టమాటాలు

ఏయూక్యాంపస్: కూరగాయల ధరలు స్వల్పంగా పెరుగుతున్నాయి. పదిరోజుల్లో కూరగాయల ధరల్లో కొద్దిగా మార్పులు వచ్చాయి. ఎండల తీవ్రత పెరగడం, దిగుబడి తగ్గడం కూడా కారణం. పూర్తిస్థాయిలో అన్ని రకాల కూరగాయలు అందుబాటులో ఉండటం లేదు. ఈ నెల 25వ తేదీన టమాటాలు కిలో రూ22 ఉండగా 25న కిలో ధర 38కి చేరుకుంది. బీరకాయలు కిలో రూ.42, మిర్చి రూ 56, అల్లం కిలో రూ.170కి చేరాయి. బంగాళా దుంపలు కిలో రూ26, ఉల్లిపాయలు కిలో రూ.25 అందుబాటులో ఉన్నాయి. పొట్లకాయ, కీరదోస, దోసకాయలు, చామదుంపలు, కంద, దేముడు చిక్కుడు, గ్రీన్ పీస్, ముల్లంగి పరిమితంగా రైతు బజార్‌లలో లభిస్తున్నాయి.

ఆకురూరలు దిగుబడి బాగుండటంతో ఇవి నాణ్యమైనవి లభిస్తున్నాయి. తోటకూర, గోంగూర, చుక్కకూర, పాలకూర, పుదీనా తక్కువ ధరకే లభిస్తున్నాయి. రైతు బజార్లలో ప్రస్తుతం మామిడి పండ్లు అధికంగా విక్రయిస్తున్నారు. బంగినపల్లి, సువర్ణరేఖ అధికంగా విక్రయిస్తున్నారు. రసాలు, పంచదార కంచెలు, హిమాంపసందు, కొత్తపల్లి కొబ్బరి వంటివి అరుదుగా దర్శనమిస్తున్నాయి. వీటి దిగుబడి తగ్గడంతో అధిక ధరలు పలుకుతున్నాయి.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీ దళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తు లు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవ లో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి. శ్రీని వాసులరెడ్డి తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఏఈవోలు కె.తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని పలు రోడ్లలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ద్వారకా ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్ సీఐ కేఎస్ఎన్వీ ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఎంవీపీ కాలనీలోని డబుల్ రోడ్డు, ఎంవీపీ సర్కిల్ నుంచి వెంకోజీపాలెం వెళ్లే రోడ్డుతో పాటు క్యాన్సర్ ఆస్పత్రి నుంచి టీటీడీ సర్కిల్ వైపు వచ్చే రోడ్లలో ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం చూపేందుకు ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో అనధికారిక పార్కింగ్‌తో పాటు రోడ్లపై అనధికారి వ్యాపార విక్రయాలు కారణంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. సాయంత్రం వేళల్లో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సీఐ ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంవీపీ ట్రాఫిక్ ఎస్ఐ భాస్కర్, ఆరిలోవ ట్రాఫిక్ ఎస్ఐ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

హిందీ పరీక్షకు ఒక్కరే హాజరు

సీతమ్మధార: స్థానిక పీఅండ్‌టీ కాలనీలోని ఎస్ఎంసీ హైస్కూల్‌లో శనివారం జరిగిన పదో తరగతి సప్లిమెంటరీ హిందీ పరీక్షకు ఒక్క బాలిక మాత్రమే హాజరైంది. 9 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా.. 8 మంది హాజరు కాలేదు. విజయనగరం జిల్లా, కొత్తవలస మండలం, కొమ్మపల్లి గ్రామానికి చెందిన ఎర్నమ్మ విశాఖలోని బీసీ హాస్టల్‌లో ఉంటూ ఎస్ఎంసీ హైస్కూల్‌లో చదువుకుంది. ఈ ఏడాది పదో తరగతి పరీక్షా ఫలితాల్లో హిందీలో ఒక్క మార్కుతో ఫెయిల్ అయింది. సప్లిమెంటరీ పరీక్షకు కష్టపడి చదివి శనివారం కొత్తవలస నుంచి తల్లిదండ్రులతో కలిసి బైక్‌పై పరీక్షా కేంద్రానికి వచ్చింది. మిగిలిన 8 మంది హాజరు కాకపోవడంతో ఈ ఒక్క విద్యార్థిని మాత్రమే పరీక్ష రాసింది.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

ఎంవీపీకాలనీ: ఐసీడీఎస్ ప్రాజెక్టు అర్బన్-1 ఆధ్వర్యంలో శనివారం జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 19వ వార్డు జాలరిపేటలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలతో పాటు ఆశ వర్కర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమాజాభివృద్ధిలో బాలికల విశిష్టతపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. తొలుతా స్థానిక ప్రభుత్వ పాఠశాల ఆవరణంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆ ప్రాంత బాలికలు, బాలింతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమాజంలో ఉన్నతంగా ఎదిగేందుకు బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భద్రత వ్యవహారాలపై అవగాహన కల్పించారు. అనంతరం రుతుక్రమంలో బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.